# రీఫిల్లింగ్‌తో గ్యాస్ సిబ్బంది మోసం

- నిండు సిలిండర్‌లోంచి గ్యాస్ తీస్తున్న వైనం
- వెల్దుర్తి ఎస్‌వీఆర్ ఏజెన్సీలో అక్రమాలు
- చర్యలు తీసుకోవాలి: గ్రామస్తులు

గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఖాళీ గ్యాస్ సిలిండర్ బరువు కొలుస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి, సెప్టెంబర్ 24: నిండు సిలిండర్‌లోంచి కొంత గ్యాస్ తీసి ఖాళీ సిలిండర్‌లో నింపి వినియోగదారులను మోసం చేస్తున్న ఘటన మండలంలోని దామరంచ గ్రామంలో వెలుగు చూసింది. 29.8 కిలోలు ఉండాల్సి సిలిండర్ నుంచి వెల్దుర్తి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది రీఫిల్లింగ్ చేసి ఖాళీ సిలిండర్‌లో సుమారు 2.5 కిలోల నుంచి 3 కిలోల వరకు గ్యాస్ తీసి సప్లై చేస్తుండగా మంగళవారం పట్టుబడ్డారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద సిబ్బంది గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని ఆపి నిండు సిలిండర్ల నుంచి ఖాళీ సిలిండర్‌లోకి రీఫిల్ చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ మహిళా గమనించి, గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో గ్రామస్తులు వాహనంతో పాటు సిబ్బందిని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వినియోగదారులకు అందించే గ్యాస్ సిలిండర్‌ను తూకం వేయగా 4 కిలోలు తక్కువగా వచ్చింది. మరో ఖాళీ సిలిండర్‌ను తూకం వేయగా 15.9 కిలోలు ఉండాల్సిన ఖాళీ సిలిండర్ 18 కిలోలు వచ్చింది. దీంతో వెల్దుర్తి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు వెన్నవరం శ్రీనివాస్‌రెడ్డి పిలిపించి, నిలదీశారు. ఏజెన్సీ సిబ్బంది వినియోగదారులను మోసం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. కొన్ని నెలల క్రితం చిన్నశంకరంపేట మండలం ధర్పల్లి గ్రామంలోనూ ఇలాంటి ఘటనే జరిగిందని, ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి వినియోగదారులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## డిగ్రీ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 24: మెదక్‌లోని గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, బీఏ, బీకాం గ్రూప్‌ల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 7901097706 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ట్రిబుల్ ఆర్ 3డీ గెజిట్ విడుదల

నర్సాపూర్, సెప్టెంబర్ 24: రీజనల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన 3డీ గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను పంచాయతీ కార్యాలయం వద్ద గెజిట్ కాపీని పరిశీలనకు ఉంచుతామని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలని సూచించారు.

## దోమల నివారణకు చర్యలు

రామాయంపేట, సెప్టెంబర్ 24: మున్సిపల్‌లోని ప్రతి వార్డులో దోమల నివారణకు రోజూ ఫాగింగ్ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని, అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు రోజూ గల్లీల్లో మెషిన్‌తో దోమ పొగను స్ప్రే చేయిస్తున్నట్లు తెలిపారు.

## తాగునీటికి ఇబ్బందులు కలిగించొద్దు

నర్సాపూర్, సెప్టెంబర్ 24: మున్సిపాలిటీలోని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో సమీక్షించారు. వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. లీకేజీ పైపులైన్లకు మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్, బీఆర్‌సీ ప్రాజెక్ట్ మేనేజర్ జగపతి బాబు, సూపర్‌వైజర్ చంద్రమౌళి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి సిబ్బంది పాల్గొన్నారు.

## చాకరిమెట్ల హుండీ లెక్కింపు

శివ్వంపేట, సెప్టెంబర్ 24: శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోగల చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. రూ.6 లక్షల 77 వేల762 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో సార శ్రీనివాస్ తెలిపారు.

## నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

అల్లాడి రాములు

రామాయంపేట, సెప్టెంబర్ 24: నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అక్బర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అల్లాడి రాములును ఎన్నుకున్నారు. రాములును లెక్చరర్లు సన్మానించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

వెల్దుర్తి, సెప్టెంబర్ 24: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీయూ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని టీపీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య అన్నారు. మంగళవారం మాసాయిపేట మండలంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వాలు నమోదు చేశారు. జిలా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, మండల అధ్యక్షుడు శివప్రసాద్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER
★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-AII

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలికలు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 24: ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 ఫుట్‌బాల్ క్రీడాకారుల (బాలుర, బాలికల) ఎంపికలు మంగళవారం మెదక్‌లోని వెస్లీ స్కూల్ మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, పీడీలు నాగరాజు, వినోద్‌కుమార్, రూపేందర్, శ్రీనివాస్‌రావు, సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 161 మంది బాలురు, 86 మంది బాలికలు పాల్గొనగా 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసినట్లు రమేశ్ తెలిపారు.

## ఇందిరాగాంధీ స్టేడియం పేరు మార్చాలి: బీజేపీ

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మెదక్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం పేరు మార్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉన్న మెదక్ స్టేడియంను ఇందిరా గాంధీ స్టేడియం అనే పేరుపై ఆక్టివిటీస్, శిలాఫలకాలపై ఇందిరా గాంధీ స్టేడియం అని చెక్కించారన్నారు. డీవైఎస్‌వో ఆదేశాల మేరకు రాయించినట్లు పంచాయతీరాజ్ శాఖ చెబుతున్నదన్నారు. మెదక్ స్టేడియానికి ఇందిరా గాంధీ అని నామకరణం చేసినట్లు ఆధారాలు లేవన్నారు. ఈ స్టేడియానికి మాజీ మంత్రి కరణం రామచంద్రరావు, ఎన్టీఆర్, మేజర్ ధ్యాన్ చంద్ స్టేడియం అనే పేర్లను పరిశీలించాలని కోరారు. ఇందిరా గాంధీ పేరు పెడితే బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్, బీజేపీ నాయకులు కరణం పరిణిత, సోమశేఖర్, ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, రాములు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్య నారాయణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు బెండ వీణ, రాములు, దుర్గాప్రసాద్, శ్రీను, కల్కి నాగరాజు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయి, టౌన్ అధ్యక్షుడు బబ్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ ముందుండాలి

రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 24: సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించి 55 ఏండ్లు పూర్తి చేసుకున్నదన్నారు. గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు.

**రామాయంపేటలో ఎన్ఎస్ఎస్ డే**

రామాయంపేట, సెప్టెంబర్ 24: పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేందుకు విద్యార్థులు శ్రమదానం చేశారని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, లెక్చరర్లు పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాలలోని పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్, చెత్తాచెదారాన్ని తీసేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్, ప్రోగ్రాం ఆఫీసర్ బాలాగౌడ్ పాల్గొన్నారు.

## వరి పంటలో గింజమచ్చలు నివారించాలి

చిలిపిచెడ్, సెప్టెంబర్ 24: వరి పంటలో గింజమచ్చలను రైతులు గమనించాలని ఏరువాక శాస్త్రవేత డాక్టర్లు వర్మ, కిరణ్ సూచించారు. మంగళవారం చండూర్, చిట్కుల్ గ్రామాల్లో రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి పొలాలను పరిశీలించారు. గింజమచ్చ రావడానికి ఆస్కారం ఉన్నందున్న రైతులు నాటీవో 80 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

## వరి పొలాన్ని పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్త

శివ్వంపేట, సెప్టెంబర్ 24: మండలంలోని ఏదుల్లాపూర్ గ్రామంలో వరి పొలాలను తునికి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రవి, నర్సాపూర్ వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి, ఏవో లావణ్య మంగళవారం సందర్శించారు. అగ్గితెగులు, ఆకు ఎండు తెగులును గుర్తించారు. ఫార్ములా 4, అగ్రి మైసిన్, 19:19:19, మందులు వాడి తెగుళ్లను నివారించవచ్చని సూచించారు. వారితో ఏఈవోలు సుభాష్, రవి వర్మ, రైతులు దడువై అశ్విన్, అశోక్ యాదగిరి రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


ఎదుల్లాపూర్ లో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో

### ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు, కోమాలోకి డ్రైవర్

నుజ్జునుజ్జైన బొలెరో

రామాయంపేట, సెప్టెంబర్ 24: ఆగి ఉన్న లారీని బొలెరో ఢీకొన్న ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని అమరావతి నుంచి హైదరాబాద్‌కు సంత్రా పండ్ల లోడుతో బొలెరో హైదరాబాద్ వైపు వెళ్తున్నది. రామాయంపేట జాతీయ రహదారిపై హైదరాబాద్ వెళ్తున్న స్కార్పియో అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టి, ఆగిపోయింది. స్కార్పియో ప్రమాదానికి గురి కావడంతో వెనుక వస్తున్న లారీని రోడ్డుపై ఆపేశాడు. దీన్ని గమనించకుండా వెనుక నుంచి సంత్రా పండ్ల లోడుతో వస్తున్న బొలెరో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న డ్రైవర్ జమీర్‌ఖాన్, మరో వ్యక్తి అందులో ఇరుక్కుపోయారు. ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రామాయంపేట పోలీసులు, ఫైర్ సిబ్బంది, 108 అంబులెన్సు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌తో సహాయక చర్యలు చేపట్టారు. గాయాలైన ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుంతల పూడ్చివేత

మరమ్మతులు పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 24: పెద్దశంకరంపేట నుంచి నారాయణఖేడ్ వెళ్లే దారిలో అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీగా గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు గమనించిన ఎస్సై శంకర్ మంగళవారం మరమ్మతులు చేయించారు. ఆయనతో ఏఎస్సై విఠల్, సిబ్బంది ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

చెత్తపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 24: బహిరంగా ప్రదేశాలు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా, మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పట్టణంలో 9, 18వ వార్డుల్లో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గీతా స్కూల్‌లోని విద్యార్థులకు తడి, పొడి చెత్త, పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మహేశ్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 24: పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గాలయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్ కార్యదర్శి, సంతోష్ పారిశుద్ధ కార్మికులతో పాఠశాలను శుభ్రం చేయించారు.

## ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 24: విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ సీఎఫ్ఎల్ అధికారులు నాగేందర్, సుధాకర్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్బీఐ విధి విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బీఐ ఖాతాదారులకు విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. బ్యాంకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కౌండిన్యగౌడ్‌కు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ బెస్ట్ పర్ఫార్మర్ అవార్డు

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ బెస్ట్ పర్ఫార్మర్ అవార్డు అందుకుంటున్న కౌండిన్యగౌడ్

చేగుంట, సెప్టెంబర్ 24: హైదరాబాద్ హోటల్ మినర్వా గ్రాండ్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చేగుంటకు చెందిన అంకన్నగారి కౌండిన్యగౌడ్ అవార్డు అందుకున్నారు. మాస్టర్ మోటివేటర్ గంప నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్‌లో భాగంగా 60 మంది ట్రైనర్స్‌లో సూపర్ కింగ్స్ టీం లీడర్ కౌండిన్య ప్రతిభ కనబర్చారు. కేవీ ప్రదీప్ ఈ సర్టిఫికెట్‌ను అందుకోగా, బెస్ట్ పర్ఫార్మర్ అవార్డు ఇంపాక్ట్ ఇన్‌చార్జి శ్యాంరాథోడ్, పర్వీన్ అందుకున్నారు. కార్యక్రమంలో మెంటర్స్ రవికుమార్, శివకుమార్, లక్ష్మణ్, వెంకటేశ్, హైమావతి, విశ్వశ్రీ, లత తదితరులు ఉన్నారు.

## పత్తిపంటలో లింగాకర్షణ బుట్టలు

పత్తిపంటలో బుట్టలు అమరుస్తున్న ఏవో

రామాయంపేట, సెప్టెంబర్ 24: పత్తి పంటను గులాబీ రంగు పురుగు ఆశించకుండా పసుపు పచ్చని బుట్టలు ఏర్పాటు చేయాలని ఏవో రాజ్ నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్పర్తి, కోమటిపల్లి, గిరిజన తండాల్లోని పొలాలను సందర్శించి, రైతులకు పత్తి పంటను ఆశించే పురుగులపై అవగాహన కల్పించారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ

మెదక్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, మున్సిపాలిటీ, టౌన్ ప్లానింగ్, పోలీస్, రవాణా సంబంధిత శాఖలతో జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వెహికిల్స్ మూలంగా అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం, ఫోర్ వీలర్స్‌కు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అన్నారు. సంబంధిత అధికారులు ప్రమాద నివారణ చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు వాహనదారులకు కనబడేలా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణ వైద్యం కోసం 108 సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీసు యంత్రాం గం, సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నదన్నారు. ప్రమాదాలపై వాహనదారులకు తగు సూచనలు చేస్తూ వాహన తనిఖీలు నిర్వహించి ఫైన్ వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, నేషనల్ హైవే పీడీ మాధవి, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, తదితరులు పాల్గొన్నారు.

## రసాయన వ్యర్థ జలాలపై రైతుల నిరసన

నిరసన తెలుపుతున్న రైతులు

శివ్వంపేట, సెప్టెంబర్ 24: కంపెనీ వదులుతున్న రసాయన వ్యర్థ జలాలలతో ఇబ్బందులు కలుగుతున్నాయని నవాబ్ పేట పరిధిలోని రైతులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని నవాబ్‌పేట పరిధిలో ఉన్న వాసదేవ కెమికల్ కంపెనీ ఎదుట రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 247లోని కెమికల్ కంపెనీ నుంచి నిత్యం రసాయన వ్యర్థ జలాలు, విషపూరితమైన పొగ వదలడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. పక్కనే ఉన్న పంట పొలాల్లో కనీసం వ్యవసాయ పనులు కూడా చేసుకోలేకపోతున్నామని వాపోయారు. ఊపిరి పీల్చుకోవడానికి కూడా వీలులేనంతగా విష వాయువులను కంపెనీ నుంచి వదులుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కంపెనీ లోపలికి వెళ్లి చూస్తే బురదతో కూడిన రసాయన జలాలు, ముక్కుపుటలు పలిగిపోయేలా కంపు కొడుతున్నట్లు తెలిపారు. ఈ కంపెనీ తమ పొలాల మధ్య ఉంటే పంటలు దెబ్బతింటున్నాయన్నారు. పర్యావరణాన్ని, పంటలను దెబ్బతీస్తున్న కంపెనీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో రైతులు గోసుకొండ ఇంద్రసేనారెడ్డి, దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిష్టారెడ్డి, వంగ వీరారెడ్డి, ఇప్ప సత్తిరెడ్డి, ఉట్ల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 24: ఉపాధి పథకంలో రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఉపాధి హామీ కేంద్ర ఆడిటింగ్ జనరల్ మాలకొండయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనుల నిర్వహణ, ఈజీఎస్ క్యాష్ బుక్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. సమావేశంలో ఆడిటర్లు శ్రీనివాస్, వంశీకృష్ణ, ముజీద్, మున్వార్ అలీ, ఎంపీడీవో రఫీకున్నీసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, ఏపీవో నవాజోద్దీన్, తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

వెల్దుర్తి, సెప్టెంబర్ 24: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం మంగళవారం వినతిపత్రం అందజేశారు.

## విజేతలకు బహుమతులు అందజేత

చేగుంట, సెప్టెంబర్ 24: తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని చేగుంట ఆదర్శ పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ తూప్రాన్ ఆధ్వర్యంలో మంగళవార కవితల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగాం ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ చంద్రకళ, అధ్యాపకులు ప్రభాకర్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## శరవేగంగా చెరువు, కుంటల సర్వే

సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

తూప్రాన్, సెప్టెంబర్ 24: తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో చెరువులు, కుంటల సర్వే శరవేగంగా కొనసాగుతుందని ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న తూప్రాన్ మండలంలోని 138 చెరువులకు 93, మనోహరాబాద్ మండలంలోని 105 చెరువులకు 77 ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్ పరిధులను నిర్ధారిస్తూ గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. హెచ్ఎండీఏ జారీ చేసి చేసిన మ్యాప్‌ల ఆధారంగా, రెవెన్యూ, ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను, వాటి పరిధిలోకి వస్తున్న పట్టాదారుల వివరాల నమోదు, సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు తూప్రాన్ మండలంలో 23 చెరువులు, మనోహరాబాద్ మండలంలో 22 చెరువుల తుది నోటిఫికేషన్ సర్వే పనులు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చేగుంట, సెప్టెంబర్ 24: మండలంలోని బీ కొండాపూర్ గ్రామంలో కూలికి వెళ్లి పాము కాటుతో పచ్చంటి మహేశ్ మృతి చెందాడు. మహేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల కోసం పలువురు రూ.9వేల ఆర్థిక సాయం అందజేశారు.

**పాపన్నపేటలో..**

నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాపన్నపేట్, సెప్టెంబర్24: తమ్మాయిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వడ్ల అశోక్ తల్లి సంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ నియోజక ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, అనిల్ రెడ్డి ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

## ఘనంగా వినాయకుడి శోభాయాత్ర

చేగుంట, సెప్టెంబర్ 24: చేగుంట మండలం మక్కరాజిపేటలో సిద్దివినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా శోభయాత్రలో పాల్గొన్న భక్తులు. వినాయకుడి లడ్డూను రూ.87 వేలకు వెంకట్‌గౌడ్ దక్కించుకున్నారు.